ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
శనివారం 19 ఏప్రిల్ 2025


మహిళకు సంక్షేమ సహాయం అందజేస్తున్న సీఎం స్టాలిన్

అమిత్‌షా వచ్చినా అధికారం దక్కదు

• తిరువళ్లూరు సభలో సీఎం స్టాలిన్

చెన్నై, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ఎంతమంది అమిత్‌షాలు వచ్చినా, ఎన్ని బెదిరింపులకు పాల్పడినా వచ్చే యేడాది అసెంబ్లీ ఎన్నికల్లో వారికి అధికారం దక్కదని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ హెచ్చరించారు. తిరువళ్లూరు జిల్లా ఆండార్‌కుప్పం వద్ద శుక్రవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో ఆ జిల్లాలో రూ.1166.32 కోట్లతో పూర్తయిన 6720 పథకాలకు ప్రారంభోత్సవం చేశారు. కొత్తగా చేపట్టనున్న 7329 పథకాలకు శంకుస్థాపనచేసి, 2,02,531 మంది లబ్ధిదారులకు సహాయాలు, 63,124 మందికి ఇళ్ళ పట్టాలు అందజేశారు. ఆ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుండటం చూసి ఓర్వలేక ప్రధాన ప్రతిపక్షాలు శత్రువులుగా మారి శాంతి భద్రతలు క్షీణించాయంటూ ప్రభుత్వంపై పసలేని ఆరోపణలు, విమర్శలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రధాన ప్రతిపక్ష నేతలు తమిళ ప్రజలు బద్ధశత్రువులుగా భావించే పార్టీలతో చేతులు కలిపి రాష్ట్రాన్ని తాకట్టుపెట్టే ప్రయత్నంలో ఉన్నారని, ఆ దిశగానే బీజేపీతో పొత్తు కుదుర్చుకున్నారని ఆరోపించారు. శాసనసభ ఆమోదించిన బిల్లులను పెండింగ్‌లో ఉంచిన గవర్నర్‌కు గుణపాఠం చెప్పేలా సుప్రీంకోర్టు నుండి చక్కటి తీర్పు సాధించుకున్నామని, ఆ తీర్పు అన్ని రాష్ట్రాలకు చెందిన గవర్నర్లకు వర్తిస్తాయనే విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు. ఆ దిశగానే ప్రస్తుతం పునర్విభజనకు వ్యతిరేకంగా ఉమ్మడి కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. అలాగే రాష్ట్ర హక్కుల పరిరక్షణ దిశగా కేంద్ర రాష్ట్రాల మధ్య సన్నిహిత సంబంధాలు పెంపొందించే రీతి జస్టిస్ కురియన్ జోసెఫ్ నాయకత్వంలో కమిటీని కూడా ఏర్పాటు చేశామని, ఆ కమిటీ చేసే ప్రతిపాదనలు అన్ని రాష్ట్రాలకు వర్తిస్తాయని స్టాలిన్ వివరించారు.

ఏడుపు కాదు... హక్కుల కోసం పోరాటం...

ఇటీవల రామేశ్వరం సభలో ప్రసంగించిన ప్రధాని మోదీ కేంద్రం ఎంత నిధులిచ్చినా ఈ రాష్ట్రంలో ఇంకా ఏడుస్తున్నారంటూ విమర్శలు చేయడం గర్హనీయమన్నారు. కేంద్రం వద్ద చేతులుచాచి నిలబడటానికి మేం భిక్షగాళ్లమా? అంటూ నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పలికిన మాటలు మరచిపోయినట్లుందన్నారు. నిధుల కోసం తామెప్పుడూ ఏడ్చే ప్రసక్తే లేదని, రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన నిధులను పొందటం తమ హక్కు అని స్టాలిన్ పేర్కొన్నారు. తానెప్పుడూ నిధులు రాలేదని పిరికిపందలా ఏడ్చే వ్యక్తి కాదని, పదవుల కోసం ఎవరి కాళ్ళవద్దకూ పాకులాడుకుంటూ వెళ్ళిన వ్యక్తి కాదని స్టాలిన్ ఎద్దేవా చేశారు. ఇటీవల నగరంలో పర్యటించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా డీఎంకే ప్రభుత్వం ప్రధాన సమస్యల నుండి ప్రజల దృష్టిని మరల్చేందుకే నీట్ సమస్యపై అనవసరమైన రాద్ధాంతం చేస్తోందని విమర్శించటం గర్హనీయమన్నారు. నీట్ మినహాయిస్తామని, నిర్బంధ హిందీ అమలు చేయబోమని అమిత్‌షా హామీ ఇవ్వగలరా? అని ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాకే రాష్ట్రానికి నిధులను బాగా తగ్గించేశారని, ఈ విషయమై గత నాలుగేళ్లుగా రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన ప్రత్యేక నిధులు గురించి అమిత్‌షా ప్రకటించగలరా? పునర్విభజనవల్ల రాష్ట్రంలో ఎంపీల సంఖ్య తగ్గదని హామీ ఇవ్వగలరా? అని స్టాలిన్ ప్రశ్నించారు.

మీ విమర్శలు మరువం...

ప్రధాని మోదీ సహా బీజేపీ పాలకులు, నాయకులు తమిళులను కించపరిచేలా ఎలా మాట్లాడారో రాష్ట్ర ప్రజలు ఇంకా మరచిపోలేదన్నారు. పార్లమెంట్‌లో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తమిళులు అనాగరికులను విమర్శించారని, పూరీ జగన్నాథ ఆలయం కోశాగారం తాళాన్ని చోరిచేసి, తమిళనాట భద్రపరిచారని అమిత్ షా, ప్రధాని మోదీ ఒడిశా సభలో విమర్శలు చేశారని, నాటి ఒడిశా సీఎంకు తమిళ ఐఏఎస్ అధికారి సహాయకుడిగా ఉంటే తమిళుడు ఒడిశాను పరిపాలించవచ్చా? అని ప్రశ్నించింది కూడా మోదీ, అమిత్‌షా లేనని స్టాలిన్ గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పున బీజేపీ పాలకులు ఎన్నికయుక్తులు పన్నుతారో, ఎలాంటి బెదిరింపులకు పాల్పడతారో అంతా తమకు తెలుసునని, ఎంత చేసిన ఎన్ని ఇబ్బందులు పెట్టినా భయపడే బానిసలం కామని, ఎంతమంది అమిత్‌షాలు వచ్చినా ఈ రాష్ట్రంలో అధికారంలోకి రాలేదని, ఈ స్టాలిన్ ఉన్నంతవరకూ వారి కుట్రలు, కుయుక్తులు ఫలించవన్నారు. ఈ కార్యక్రమంలో తిరువళ్లూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాజర్, ఎంపీలు జగద్రక్షగన్, శశికాంత్ సెంథిల్, శాసనసభ్యులు రాజేంద్రన్, గోవిందరాజన్, కృష్ణసామి, దురై చంద్రశేఖర్, సుదర్శనం, చంద్రన్, గణపతి, తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ప్రతాప్, ఆవడి కార్పొరేషన్ మేయర్ ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా ఫార్ములా చెల్లదు

కేంద్రంలోని బీజేపీ పాలకులు రాష్ట్రాన్ని ఎన్ని విధాలుగా ఇబ్బంది పెట్టాలో అన్ని విధాలుగా ఇబ్బందులు పెడుతూనే ఉందని, వాటన్నింటిని అధిగమించి డీఎంకే ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధిపరస్తోందని, అన్ని రంగాల్లో ముందంజలో ఉందని కేంద్ర ప్రభుత్వమే తన నివేదికలలో వెల్లడిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం గనుక నిధులను సక్రమంగా విడుదల చేసి ఉంటే మరింత ప్రగతిపథంలో పయనించేదని స్టాలిన్ వెల్లడించారు. అమిత్‌షా పార్లమెంట్‌లో 2026లో తమిళనాట తామే అధికారంలోకి వస్తామని ప్రకటించారని, నగరంలో పర్యటించినప్పుడు కూడా ఆ మాటే చెప్పారని, ఢిల్లీ పాలకులకు రాష్ట్రం ఎన్నడూ అడుగులకు మడుగులొత్తదని స్టాలిన్ తేల్చిచెప్పారు. ప్రతిపక్షాలు పాలిస్తున్న రాష్ట్రాలలో ఈడీ దాడుల పేరుతో భయపెట్టి పార్టీల మధ్య చీలికలు పెట్టి అధికారాన్ని చేజిక్కించుకుంటోందని, తమిళనాట ఆ ఫార్ములా పనిచేయదని స్టాలిన్ అన్నారు. రాష్ట్రంలో కొన్ని పార్టీల నేతలను భయపెట్టి కూటమిలోకి చేర్చుకుని ఎన్నికల్లో పోటీ చేసినా గెలిచే ప్రసక్తే ఉండదన్నారు. అమిత్‌షా తన బలగాలన్నింటినీ వెంటబెట్టుకుని వచ్చినా డీఎంకే కూటమి చేతిలో ఓటమి చెందటం ఖాయమన్నారు.

తమిళ మాధ్యమంలోనే వైద్య విద్య

• మంత్రి సుబ్రమణ్యం

పారీస్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే తమిళ మాధ్యమంలో వైద్యవిద్యా కోర్సులుండే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆరోగ్య శాఖామంత్రి ఎం.సుబ్రమణ్యం పేర్కొన్నారు. సైదాపేట సడయప్పన్‌వీధిలో కొత్తగా నిర్మించిన ఓ ప్రైవేటు ఆస్పత్రిని ప్రారంభించిన సందర్భంగా మంత్రి సుబ్రమణ్యం మీడియాతో మాట్లాడారు. ఎగ్మోర్‌లోని ప్రభుత్వ ప్రసూతి కేంద్రంలో ఇటీవల ప్రారంభించిన సంతాన సాఫల్య కేంద్రానికి ప్రజాదరణ పెరుగుతోందని, మదురై, సేలం, కోవై ప్రాంతాల్లో కూడా వీటిని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. తమిళ మీడియంలో ఎంబీబీఎస్ పాఠ్యాంశాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నదే సీఎం స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.



మూడేళ్ళ క్రితమే వైద్యవిద్యకు సంబంధించిన పాఠ్యపుస్తకాలను తమిళంలో తర్జుమా చేసే ప్రక్రియను తమిళనాడు టెక్స్ట్‌బుక్స్ సొసైటీ పూర్తిచేసిందని తెలిపారు. ఈ పుస్తకాలను ప్రభుత్వ పాఠశాలల్లో 7.5శాతం రిజర్వేషన్ కోటాలో చదువుకుని ఎంబీబీఎస్ ఫస్ట్ ఇయర్‌లో చేరిన విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వైద్య విద్యార్థులు ఐదేళ్ళ పాటు తమిళ మాధ్యమంలో చదవడంలో పలు సమస్యలున్నాయని, వాటిని సడలించడంపై ఆలోచించి నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి వివరించారు. ముదల్వర్ మెడికల్ షాపుల్లో మందులకు కొరత ఏర్పడినట్లు మీడియాలో వస్తున్న కథనాలు అవాస్తవమన్నారు. రాష్ట్రంలో మరో ఆరు వైద్యవిద్యా కళాశాలలను కొత్తగా ఏర్పాటు చేసేందుకు అనుమతి కోరుతూ కేంద్రప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిపారు. రాష్ట్రంలోవున్న అన్ని వైద్యవిద్యా కళాశాలల్లో ప్రిన్సిపాళ్లు పనిచేస్తున్నారని, రాయపురం స్టాన్లీ వైద్య కళాశాలలో మాత్రమే ప్రిన్సిపాల్ పోస్టు భర్తీ చేయలేదన్నారు. అయినప్పటికీ మెడికోల సంక్షేమార్థం తాత్కాలిక ప్రిన్సిపాల్‌ను నియమించినట్లు తెలిపారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ నిర్వహణలో వున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీ అయిన వైద్యులు, నర్సుల పోస్టుల భర్తీకి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖా మంత్రి కేఎన్ నెహ్రూ చర్యలు చేపట్టారన్నారు.

• రెండాకుల గుర్తు వ్యవహారం..

28న హాజరు కండి

• ఓపీఎస్, ఈపీఎస్‌కు ఈసీ ఆదేశం




చెన్నై, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే గుర్తు రెండాకుల చిహ్నాన్ని ఏ వర్గానికి కేటాయించాలనే విషయంపై ఈ నెల 28న విచారణకు హాజరుకావాలంటూ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి(ఈపీఎస్), మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్)కు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలిచ్చింది. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఈపీఎస్ ఎంపిక చెల్లదని ప్రకటించాలని, రెండాకులు గుర్తును ఆయన వర్గానికి కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ సూర్యమూర్తి అనే వ్యక్తి కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. అదే విధంగా హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసుపై విచారణ జరిపిన హైకోర్టు ఈ వివాదానికి సంబంధించి అన్ని వర్గాల వారిని విచారణ జరిపి తుది నిర్ణయాన్ని ప్రకటించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి సూచించింది. అదే సమయంలో కేసీ పళనిసామి, పుగళేంది, ఓపీఎస్ కుమారుడు రవీంద్రనాథ్ సహా ఐదుగురు ఈ వ్యవహారంలో తమ తరపు వాదనలు కూడా పరిగణనలోకి తీసుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి వినతి పత్రం సమర్పించారు. అయితే ఆ ఐదుగురికి పార్టీలో సభ్యత్వం లేదని, వారి అభిప్రాయాలను తెలుసుకోవాల్సిన అవసరం లేదని ఈపీఎస్ వర్గీయులు ఎన్నికల సంఘానికి మరో ఫిర్యాదు చేశారు. ఈ కేసు విచారణ హైకోర్టులో కొనసాగుతున్నప్పుడు ప్రజా ప్రాతినిధ్య చట్టం 29-ఎ ప్రకారం ఓ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే అధికారం ఎన్నికల సంఘానికిలేదని, ఎన్నికల సమయంలో పార్టీలకు చిహ్నాలు కేటాయించడమే ఆ సంఘం ప్రధాన విధి అని తెలిపారు. ఓ పార్టీలో చీలికలు వస్తే ఏ వర్గానికి ఎక్కువ సభ్యులున్నారో ఆ వర్గానికే పార్టీ చిహ్నం కేటాయించాల్సి ఉంటుందని అన్నాడీఎంకే తన వాదనలు వినిపించింది. ఈ వ్యవహారంలో ఎన్నికల సంఘం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ఆ సంఘానికి కాల నిర్ణయాన్ని ప్రకటించాలని ఈపీఎస్ తరఫున కోర్టులో మరో పిటిషన్ కూడా దాఖలైంది. ఈ నేపథ్యంలో ఈ నెల 28 మధ్యాహ్నం 3 గంటలకు తమ కార్యాలయంలో జరుగనున్న విచారణకు స్వయంగా హాజరుకావాలంటూ ఈపీఎస్, ఓపీఎస్‌కు, పిటిషనర్ సూర్యమూర్తి తదితరులకు కేంద్ర ఎన్నికల సంఘం నోటీసులు పంపింది.

23న ఎడప్పాడి నివాసంలో ఎమ్మెల్యేలకు విందు...

అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) పార్టీ ఎమ్మెల్యేలు, ప్రముఖులకు ఈ నెల 23 రాత్రి మెగా విందును ఏర్పాటు చేస్తున్నారు. బీజేపీతో పొత్తు ఖరారైన సందర్భంగా ఈ విందు కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో తమ కూటమి ఘన విజయం సాధించేందుకు పార్టీలో అందరినీ సంతృప్తిపరిచే రీతిలో ఈ విందు కార్యక్రమాలుంటాయని చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

పెరంబూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా వడచెందూర్ సమీపంలో కారును లారీ ఢీకొన్న ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు మృతిచెందారు. కారులో ప్రయాణిస్తున్న మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టంకు, క్షతగాత్రులను చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు, మృతుల వివరాలు సేకరించడంతో పాటు పరారైన లారీ డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

అధికారంలో భాగస్వామ్యం కోరం

• సీట్ల సర్దుబాటుపై చర్చలు జరగలేదు
• బీజేపీ చీఫ్ నయినార్ నాగేంద్రన్



అడయార్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రభుత్వంలో భాగస్వామ్యం అడగమని, కూటమిలో సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుపలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ స్పష్టం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన తర్వాత ఆయన తొలిసారిగా ఓ ఆంగ్లపత్రికకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్నాడీఎంకే - బీజేపీ మధ్య అసెంబ్లీ సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుపలేదన్నారు. అలాగే అన్నాడీఎంకే ప్రభుత్వంలో భాగస్వామ్యం కోరబోమని ఆయన పునరుద్ఘాటించారు. అన్నాడీఎంకే, బీజేపీ పార్టీల మధ్య పొత్తు హడావుడిగా ఏర్పాటైంది కాదన్నారు. 2019, 2021 ఎన్నికల్లో కూడా తాము కలిసే పోటీ చేశామని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో ఇకపై కలిసి ముందుకు సాగాలన్న ఏకైక లక్ష్యంతోనే ఈ కూటమిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇపుడు రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న డీఎంకే కూటమిని ఓడించడమే తమ ఏకైక లక్ష్యమన్నారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు ఇంకా ఒక యేడాది సమయం ఉందని, అందువల్ల సీట్ల సర్దుబాటుపై ఇపుడే చర్చించాల్సిన అవసరం లేదన్నారు. అదేసమయంలో వచ్చే ఎన్నికల తర్వాత మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి సారథ్యంలోని అన్నాడీఎంకే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందంటూ పలు సర్వేలు ఇప్పటికే సూచన ప్రాయంగా వెల్లడించాయన్నారు. ఈ సర్వేల అంచనా ప్రకారం అన్నాడీఎంకే కూటమి అధికారంలోకి వస్తే ప్రభుత్వంలో భాగస్వామ్యం కోరబోమన్నారు. నీట్‌ను డీఎంకే తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, వాస్తవానికి కాంగ్రెస్ - డీఎంకే కూటమిలోనే నీట్ ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఇపుడు నీట్‌ను రాజకీయం చేస్తున్నారని నయినార్ నాగేంద్రన్ ఆరోపించారు.

శిలువ మార్గం ఊరేగింపు దృశ్యాలు




భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

• చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

ప్యారీస్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మానవాళి శ్రేయస్సు కోసం యేసుక్రీస్తు ప్రాణత్యాగం చేసిన ఘట్టాన్ని గుర్తుచేసుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా క్రైస్తవులు శుక్రవారం ఉపవాస ప్రార్థనల్లో పాల్గొన్నారు. 2000ఏళ్ళ క్రితం గలిలియా సముద్రతీరాన వున్న ప్రాంతంలోని పల్లెలో పర్యటించిన యేసుక్రీస్తు అక్కడి ప్రజలకు తన సూక్తులను, ఉపమాన కథలను వివరించి చైతన్యవంతులను చేశారు. దీనిని చూసి ఓర్వలేని యూదు మత పెద్దలు క్రీస్తుపై నిందమోపి విప్లవకారుడిగా ముద్రవేశారు. నాటి రోమన్ రాజరికం కూడా దీనిని నమ్మి ఏసుక్రీస్తును దోషిగా ప్రకటించి శిలువపై వేలాడదీశారు. ఆ స్థితిలో కూడా దైవుడ్ని ఏడు కోరికలు కోరినట్లు బైబుల్ గ్రంథంలో వినిపిస్తుంది. కొయ్య శిలువపై వుంచి తలపై ముళ్ళకిరీటం పెట్టి, కాళ్లకు, చేతులకు మేకులు కొట్టినా బాధలోనూ ఆయన క్షమాగుణాన్ని వీడలేదు. తన ప్రేమ సందేశాన్ని వినిపించి రక్తశిక్తమైన స్థితిలో ఆ శిలువపైనే మరణించిన ఘట్టమే గుడ్‌ఫ్రైడే. భస్మ బుధవారం సందర్భంగా 40 రోజుల ఉపవాస దీక్షలు చేపట్టి, ఈస్టర్ పండుగ వరకు ప్రార్థనల్లో గడుపుతారు.


పెరంబూరు లూర్థుమాత చర్చిలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు

గుడ్‌ఫ్రైడేకి సంబంధించి మరికొన్ని వార్తలు | 6,7 పేజీల్లో...

శ్రీరంగంలో చిత్తిరై ఉత్సవాలు ప్రారంభం

చెన్నై, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అష్టోత్తర శత వైష్ణవ దివ్యక్షేత్రాల్లో మొదటిది, భూలోక వైకుంఠంగా భాసిల్లుతున్న శ్రీరంగం రంగనాథస్వామి వారి ఆలయంలో వార్షిక చిత్తిరై ఉత్సవాలు శుక్రవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నంబెరుమాళ్ వేకువ జాము మూడు గంటలకే మూలస్థానం నుండి బయలుదేరి 3.15 గంటలకు ధ్వజస్తంభ మంటపానికి వేంచేశారు. ఆ తర్వాత ఆలయ ప్రధానార్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛారణ, మంగళవాయిద్యాల నడుమ ధ్వజారోహణం చేశారు. ఉదయం 6.15 గంటలకు నంబెరుమాళ్ ధ్వజస్తంభమండపం నుండి బయలుదేరి ఉదయం అద్దాల మండపానికి చేరుకున్నారు. సాయంత్రం 6.30 గంటలకు నంబెరుమాళ్ ఉభయ నాంచారులతో బయలుదేరి చిత్తిరై వీధుల్లో ఊరేగి రాత్రి చందన మండపానికి చేరుకున్నారు. ఆ తర్వాత అక్కడి నుండి బయలుదేరి రాత్రి 9 గంటలకు యాగశాల మండపానికి వేంచేయగా, నంబెరుమాళ్‌కు తిరుమంజనం నిర్వహించారు. అక్కడి స్వామివారు బయలుదేరి శనివారం వేకువజాము 2 గంటలకు అద్దాల మండపానికి చేరుకుంటారు. సాయంత్రం కల్పవృక్షవాహనంలో, ఆదివారం ఉదయం సింహవాహనంలో, సాయంత్రం యాళివాహనంలో, సోమవారం ఉదయం ద్విప్రభ వాహనంలో సాయంత్రం గరుడవాహనంలో స్వామివారు ఊరేగనున్నారు. 22 ఉదయం శేషవాహనంలో, సాయంత్రం హనుమంతవాహనంలో 23 ఉదయం స్వర్ణహంసవాహనంలో, సాయంత్రం గజవాహనంలో నంబెరుమాళ్ చిత్తిరై వీధుల్లో ఊరేగనున్నారు. 24న నెల్లలవు వేడుకల్లో (వరిధాన్యం కొలతల ఉత్సవంలో) పాల్గొంటారు. 25 ఉదయం రజత అశ్వవాహనం, సాయంత్రం స్వర్ణ అశ్వవాహనంలో ఊరేగనున్నారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన చిత్తిరై రథోత్సవం ఈ నెల 26న జరుగనుంది. 27న సప్తావరణ వేడుకలు నిర్వహించనున్నారు. 28న స్వామివారికి అధికార పల్లకీసేవలతో ఈ వేడుకలు ముగియనున్నాయి. ఈ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ డిప్యూటీ కమిషనర్ శివరామ్‌కుమార్, ఆలయ సూపరింటెండెంట్ వేల్‌మురుగన్ ఇతర అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.


ధ్వజారోహణం చేస్తున్న ఆలయ ప్రధానార్చకులు

సమాచార దృష్టి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా ఆవడి పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. పట్టాభిరామ్, చేక్కాడు, తందురై, అయ్యప్పన్ నగర్, శ్రీదేవి నగర్, కన్నపాళయం, గోపాలపురం, వీజీవీ నగర్, వీజీఎన్ నగర్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

దురైపాక్కంలో 'బుక్ ఎగ్జిబిషన్'

పెరంబూర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): భారతి పుస్తకాలయం,షోలింగనల్లూర్ నియోజకవర్గ ప్రజల సంక్షేమం సహా ఏడు సంస్థల ఆధ్వర్యంలో ఓఎంఆర్‌లో బుక్ ఎగ్జిబిషన్ శుక్రవారం ప్రారంభమైంది. దురైపాక్కం సన్‌మార్గ్ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌లో కథలు, నవలలు, చరిత్ర, పిల్లల కామిక్స్ పుస్తకాలు, ఆరోగ్య సంబంధిత పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 27వ తేది వరకు ప్రతిరోజు ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ బుక్ ఎగ్జిబిషన్‌ను సందర్శించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

'నీట్'కు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సులకు సంబంధించిన 'నీట్'కు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) పీజీ వైద్య కోర్సుల అడ్మిషన్లకు ఏడాదికి రెండు సార్లు ఆన్‌లైన్ ద్వారా 'నీట్' పరీక్ష నిర్వహిస్తుంది. దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లోని 53 వేల పీజీ సీట్లలో చేరేందుకు సుమారు 2 లక్షల మంది ఎంబీబీఎస్ పూర్తిచేసిన వారు నిరీక్షిస్తున్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను మే 7వ తేది వరకు అనే వెబ్‌సైట్‌లో నమోదుచేసుకోవచ్చు. జూన్ 15వ తేది ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటలు, 3.30 నుంచి రాత్రి 7 గంటల వరకు రెండు విడతలుగా ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షా ఫలితాలు జూలై 15న విడుదల చేయనున్నట్లు ఎన్‌బీఈఎంఎస్ ఒక ప్రకటనలో తెలిపింది.

25న ప్రైవేటు సంస్థల జాబ్ మేళా

పెరంబూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా ఉపాధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేది జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ అరుణ్‌రాజ్ విడుదల చేసిన ప్రకటనలో... కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగనున్న ఈ జాబ్ మేళాలో సుమారు 50కి పైగా ప్రైవేటు సంస్థలు 5వేలలకు పైగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. 8,10, ప్లస్ టూ ఉత్తీర్ణులైన వారు, బీఈ, ఐటీఐ, డిప్లొమో, నర్సింగ్, ఫార్మాసిస్ట్, ల్యాబ్ అసిస్టెంట్ తదితర కోర్సులు పూర్తిచేసిన వారు ఈ మేళాలో పాల్గొనవచ్చు. వివరాలకు 044-27426020, 6383460933 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

విమానాశ్రయంలోకి ఎంటీసీ బస్సులు

పెరంబూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) త్వరలో అంతర్జాతీయ విమానాశ్రయంలోకి బస్సులు నడుపనుంది. ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు ఎక్కేందుకు, దిగేందుకు వీలుగా విమానాశ్రయం వరకు బస్సులు నడపాలని నిర్ణయించారు. ప్రస్తుతం విమాన ప్రయాణికులు సిటి బస్సు ఎక్కేందుకు విమానాశ్రయం నుంచి సుమారు కి.మీ నడవాల్సిన పరిస్థితి ఉందని, ప్రయాణికుల సౌకర్యార్థం తీసుకున్న ఈ నిర్ణయం త్వరలో అమలుకు రానుందని అధికారులు తెలిపారు.

పర్యాటక ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులను పురస్కరించుకుని మెరీనా, మహాబలిపురం, వండలూరు పార్క్ తదితర పర్యాటక ప్రాంతాలకు వంద ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు మెట్రో ట్రాన్స్‌పోర్ట్స్ కార్పొరేషన్ (ఎంటీసీ) తెలిపింది. ఎంటీసీ సంస్థ నగరం, శివారు ప్రాంతాల్లోని 650 మార్గాల్లో 3,400 బస్సులు నడుపుతోంది. వేసవి సెలవుల సందర్భంగా ఈ నెల చివరి వారం నుంచి జూన్ మొదటి వారం వరకు పర్యాటక ప్రాంతాలకు వంద ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు అధికారులు తెలిపారు.

'అసిస్టెంట్ కుక్' పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జీసీసీ పాఠశాలల్లోని పౌష్టికాహార కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 179 అసిస్టెంట్ కుక్ పోస్టులు భర్తీ చేయనున్నారు. 10వ తరగతి ఫెయిలై, 21 నుంచి 40 లోపు న్న మహిళలు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవ చ్చు. తమిళం చదవడం, రాయడం తెలిసి, పాఠశాల పరిధిలో 3 కి.మీ పరిధిలో నివసిస్తున్న వారు అర్హులు. స్వీయ వివరాలతో కూడిన దరఖాస్తులను 'అదనపు విద్య అధికారి, విద్యాశాఖ, పౌష్టికాహార విభాగం, అమ్మ మాలిగై, చెన్నై కార్పొరేషన్-600003' అనే చిరునామాలో ఈ నెల 30వ తేదిలోగా సమర్పించాలి. వివరాలకు జీసీసీ కార్యాలయం, 15 మండల కార్యాలయాలు సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

ఉద్యోగాల్లో తమిళంలో చదువుకున్నవారికే ప్రాధాన్యత

ప్యారీస్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తమిళ మీడియంలో చదువుకున్నవారికి మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించనున్నట్లు రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు శుక్రవారం సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో 1వ తరగతి నుండి తమిళ మీడియంలో చదువుకున్న వారికి ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఉంటుందని, ఇతర భాషల్లో చదువుకుని తమిళంలో పరీక్షలు రాసినవారు ఈ రిజర్వేషన్‌కు అనర్హులని తెలిపింది. విద్యాహక్కు చట్టం కింద 2వ తరగతి నుండి 8వ తరగతి వరకు తమిళ మీడియం ఎంచుకుని చివరిదాక అందులోనే చదివి ఉత్తీర్ణులైన వారికి అలాగే, ఇతర రాష్ట్రాల్లో తమిళ మీడియంలో చదువుకుని ఆ తర్వాత రాష్ట్రానికి వచ్చి తమ విద్యను కొనసాగించి ఉన్నత కోర్సుల్లో చేరి, చదువుపూర్తి చేసుకున్నవారికి మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. విద్య, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, మార్కుల లిస్ట్‌లో తమిళ మీడియంలో చదువుకున్నారని నిర్ధారిస్తే నే అధికారులు అభ్యర్థులను ఎంపిక చేయాలని, హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఉద్యోగ అవకాశాల్లో నిబంధనలను సవరించినట్లు రాష్ట్రప్రభుత్వం తన ప్రకటనలో తెలియజేసింది.



వేపేరిలోని మద్రాస్ సెంటినరీ తెలుగు బాప్టిస్టు సంఘంలో ప్రత్యేక ప్రార్థనలు - విల్లివాక్కం రక్షణసైన్యం సంఘంలో ప్రసంగిస్తున్న మేజర్ ఆర్.నాగేశ్వరరావు , హాజరైన తెలుగు క్రైస్తవులు

శిలువ ధ్యాన ఆరాధనలు

● తెలుగు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

ప్యారీస్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలో తెలుగు క్రైస్తవులు అత్యధికంగా నివసిస్తున్న ప్రాంతాల్లోని చర్చీల్లో గుడ్‌ఫ్రైడే పర్వదినాన శిలువ ధ్యాన ఆరాధనలు నిర్వహించారు. ఉపవాసం పాటిస్తున్న క్రైస్తవులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు యేసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటల సారాంశాన్ని సంఘ కాపరులు, క్రైస్తవ పెద్దలు వినిపించారు. ప్రత్యేక ప్రార్థనలకు ముందు 'శిలువ మార్గం' ఊరేగింపులో కొయ్య శిలువలు పట్టుకుని పాటలు పాడుతూ యేసుక్రీస్తు త్యాగాన్ని కీర్తిస్తూ, పిల్లల నుండి పెద్దల వరకు తమ భక్తిని చాటుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల అనంతరం భక్తులందరికి చర్చి ప్రాంగణాల్లో మజ్జిగ, పండ్లరసం, పాయసం, బ్రెడ్, బిస్కెట్లను సంఘాల నిర్వాహకులు పంపిణీ చేశారు.

పెన్షనర్స్‌లైనులో...

పాతచాకలిపేట పెన్షనర్స్‌లైను రెండో వీధిలోని తెలుగు బాప్టిస్టు చర్చిలో సంఘ కాపరి రెవ.తాటిపర్తి ఐజర్ అధ్యక్షతన గుడ్‌ఫ్రైడే ఆరాధన నిర్వహించారు. సండే స్కూల్, స్త్రీల సమాజం, యూత్, కన్వీనర్లు ప్రత్యేక గీతాలు ఆలపించారు. ఏర్పాట్లను సంఘ నిర్వాహకులు వీఎస్ యేసుదాస్, బీఐ రఘు, జి.రమేష్, జె.చక్రవర్తి, ఎం.పౌల్, కె.దాసు, బి.సురేష్ తదితరులు పర్యవేక్షించారు.

వేపేరిలో...

వేపేరి హైరోడ్డులో వున్న మద్రాస్ సెంటినరీ తెలుగు బాప్టిస్టు సంఘంలో కాపరి రెవ.డా.ఎస్ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఆరాధనలో నగరంలోని తెలుగువారు పాల్గొన్నారు. సంఘ అధ్యక్షులు జి.రామయ్య, కార్యదర్శి పోతల ప్రభుదాస్, ట్రెజరర్ ఐ.మార్కు ఇతర కమిటీల నిర్వాహకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విల్లివాక్కంలో..

విల్లివాక్కంలోని రక్షణసైన్యం సంఘంలో కోర్ ఆఫీసర్లు మేజర్ ఆర్.నాగేశ్వర్, మేజర్ ఆర్ ఎస్తేర్‌రాణి సారథ్యంలో జరిగిన శుభ శుక్రవారం ఆరాధనలో ఏడు మాటలపై ప్రసంగాలు, ప్రత్యేక గీతాలు ఆలపించారు.

చూలైలో...

చూలై ప్రాంతంలోని తెలుగు బాప్టిస్టు చర్చిలో గుడ్ ఫ్రైడే ఆరాధన సీనియర్ పాస్టర్ రెవ.డా. ఎం.ఈశ్వరప్ప అధ్యక్షతన జరిగింది. అసిస్టెంట్ పాస్టర్ రెవ. వి.జేసుదాస్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పెనుగొండ ఎల్ఎఫ్‌డీఎఫ్ మినిస్ట్రీకి చెందిన పాస్టర్ డి.షాలెం సందేశం అందించారు. సంఘ నిర్వాహకులు జి.సురేష్‌కుమార్, ఏ.లాబాన్, ఎండి.వీరరాజు, పి.ప్రభుదాస్, వి.యేసుదాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కొరట్టూరులో...

కొరట్టూరు కండిగైవీధిలోని సత్యజీవ మార్గము మినిస్ట్రీ చర్చిలో సంఘ కాపరి రెవ.పి.మెల్కిసెదక్ అధ్యక్షతన మంచి శుక్రవారం ఆరాధన జరిగింది. సంఘ సభ్యులు జి.బర్నబాస్ బాబు, డి.సతీష్‌కుమార్, ఎ.అపర్ణ, వీఎల్ సింధియా, ఎస్.కొండయ్య, బి.డేవిడ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పెన్షనర్స్‌లైను తెలుగు బాప్టిస్టు చర్చిలో శుభ శుక్రవారం ఆరాధన



ఎగ్మోర్‌లో శిలువ ధ్యానం ఆరాధనలో చిన్నారులు - చూలై తెలుగు బాప్టిస్ట్ చర్చిలో గుడ్‌ఫ్రైడే ఆరాధనలో నిర్వాహకులు - కొరట్టూరులో సత్యజీవ మార్గము మినిస్ట్రీ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

ఘనంగా సెయింట్ మేరీ పాఠశాల స్నాతకోత్సవం

తిరుత్తణి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని సెయింట్ మేరీ మెట్రిక్యులేషన్ హైయ్యర్ సెకండరీ పాఠశాల స్నాతకోత్సవాన్ని ఆ పాఠశాల నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ వేడుకల్లో పాఠశాల ఛైర్మెన్ రెవ. ఫాదర్ అరుల్‌రాజ్ దైవప్రార్థనతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విద్యాపీఠం సీనియర్ సెకండరీ పాఠశాల ఇన్‌చార్జ్ కె.విశ్వభారతి, పీవీఆర్ సినిమాస్ మేనేజర్ వి.జ్యోతికుమార్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న టీచర్లు

చిత్రా పౌర్ణమి వేడుకలకు తరలిరండి

● 'పసుమై తాయగం' అధ్యక్షులు సౌమ్య అన్బుమణి

పెరంబూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వర్తక సంఘం ఆధ్వర్యంలో మే 11న నిర్వహించనున్న చిత్రా పౌర్ణమి వేడుకల్లో పాల్గొనాలని పసుమై తాయగం అధ్యక్షులు సౌమ్య అన్బుమణి పిలుపునిచ్చారు. కోయంబేడులో పనిచేస్తున్న స్నేహితుల సంక్షేమం వివాహ సమాచార కేంద్రాన్ని ఆన్‌లైన్ సమాచార కేంద్రంగా మార్చారు. ఈ కేంద్రం ప్రారంభోత్సవం శుక్రవారం జి.చెల్లప్ప అధ్యక్షతన జరగగా, ముఖ్య అతిథిగా సౌమ్య పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి నిత్యానందం, ఉప కార్యదర్శులు కె.అన్నామలై, ఎస్.మునుస్వామి, ఉపాధ్యక్షులు డా.ఎస్.వజ్రవేలు, 'పసుమై తాయగం' రాష్ట్ర ఉప కార్యదర్శి ఎన్.కన్నన్ సహా పలువురు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రిక విడుదల చేసిన సౌమ్య అన్బుమణి

గృహాలకు పైప్ లైన్ ద్వారా సహజవాయువు సరఫరా

● కేంద్ర ప్రభుత్వం అనుమతి

పెరంబూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, దిగుమతి ఖర్చులు తగ్గింపు, సహజ వాయువు వినియోగం పెంచేలా కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో చెన్నై సహా 9 జిల్లాల్లో పైప్ లైన్ ద్వారా గృహాలకు సహజ వాయువు సరఫరా చేసే ప్రాజెక్ట్‌కు తమిళనాడు తీరప్రాంత నిర్వహణ అథారిటీ ఆమోదం తెలిపింది. ఆ ప్రకారం నీలాంగరై, అడయార్, తిరువాన్మియూర్, చేరపాక్కం, రాయపురం, బ్రాడ్‌వే, తండయార్‌పేట, తిరువొత్తియూర్, ఎన్నూర్ తదితర ప్రాంతాల్లో 'టొరంట్ గ్యాస్' ఈ ప్రాజెక్ట్ అమలుచేయనుంది. ఈ పైప్ లైన్ మొత్తం 466 కి.మీ పొడవున నిర్మించాల్సి ఉండగా, అందులో 260 కి.మీ తీరప్రాంత నిర్వహణ అథారిటీ పరిధిలో ఉంది. టొరంట్ గ్యాస్ సంస్థ రూ.48 కోట్లతో ఈ ప్రాజెక్ట్ అమలుకు తమిళనాడు తీరప్రాంత నిర్వహణ అథారిటీ అనుమతులు మంజూరు చేసింది.

కళాశాలల్లో ఘర్షణలు జరగకుండా ప్రత్యేక కమిటీ

● రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు సూచన

పెరంబూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కళాశాల విదార్థులు ఘర్షణలకు పాల్పడకుండా నిరోధించేలా ప్రత్యేక కమిటీ ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి మద్రాసు హైకోర్టు సూచించింది. నగరంలోని పచ్చయప్పన్, రాజధాని కళాశాల విద్యార్థుల మధ్య తలెత్తిన ఘర్షణ కారణంగా ఓ విద్యార్థి మృతిచెందాడు. ఈ కేసు విచారించిన న్యాయమూర్తి జగదీష్ చంద్ర... అనేక మంది నాయకులు చదువుకున్న ప్రతిష్ఠాత్మక కళాశాలల విద్యార్థులు ప్రస్తుతం నేర కార్యకలాపాలకు పాల్పడడం ఆవేదన కలిగిస్తుందన్నారు. నేరస్తులుగా జన్మించరని, వారు తయారవుతున్నారని న్యాయమూర్తి పేర్కొన్నారు. అదే సమయంలో కళాశాలల విద్యార్థు మధ్య తలెత్తుతున్న ఘర్షణలు నిరోధించేలా ప్రత్యేక కమిటీ ఏర్పాటుచేయాలని న్యాయమూర్తి సూచించారు.

మరో డీఎంకే నేత వివాదాస్పద వ్యాఖ్యలు

వాషర్‌మెన్‌పేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వివాహం జరిగిన రోజే పిల్లలు పుట్టరని, అందుకు ముందుగానే ప్రేమించి గర్భం ధరించి ఉండాలని డీఎంకే రాజ్యసభ ఎంపీ కళ్యాణసుందరం మాటలు మరోసారి కలకలం రేపాయి. తంజావూరు జిల్లా కుంభకోణం సమీపం శేషంబాడి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం 'కలైంజర్ కనవు ఇల్లం' పథకం కింద 261 మంది లబ్దిదారులకు ఇంటి పత్రాలు అందజేసే కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉన్నత విద్యాశాఖ మంత్రి కేవీ చెళియన్ పాల్గొని, లబ్దిదారులకు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎంకే ఎంపీ కళ్యాణసుందరం, ఎమ్మెల్యే అన్బళగన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కళ్యాణ సుందరం మాట్లాడుతూ. వివాహమైన పది నెలల తర్వాతే పిల్లలు పుడతారని, ఒకవేళ వివాహం రోజునే పిల్లలు పుట్టాలంటే ప్రేమించి గర్భం ధరిస్తే వివాహం రోజున పిల్లలు పుడతారని వ్యాఖ్యానించారు. అలాగే, అవసరంగా మాట్లాడడం, ఆగ్రహంతో మాట్లాడడం వలన మంచి పని చేయాలనుకునే వారికి ఆసక్తి తగ్గిపోతుందన్నారు. ప్రజలు తమకు అవసరాలు తీర్చాలి అని కోరాలి కానీ, ఆవేశంతో వితండవాదంగా మాట్లాడ కూడదని ఎంపీ సూచించారు. కాగా, కొద్దిరోజుల క్రితం మంత్రి పొన్ముడి 'వేశ్య' అంటూ మహిళలను కించపరిచేలా మాట్లాడడంతో అతడిని పార్టీ పదవి నుంచి తొలగిస్తూ డీఎంకే ప్రకటన విడుదల చేయగా, ఆయన మంత్రి పదవి కూడా కోల్పోయే అవకాశముందని రాష్ట్రంలో చర్చలు సాగుతున్నాయి.



ప్రసంగిస్తున్న డీఎంకే ఎంపీ కళ్యాణ సుందరం

గవర్నర్‌ను రీకాల్ చేయాలంటూ 25న సీపీఎం ధర్నా

పెరంబూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవిని సత్వరం రీకాల్ చేయాలని కోరుతూ ఈ నెల 25న సీపీఎం ధర్నా చేపట్టనుంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం విడుదల చేసిన ప్రకటనలో... రాజ్యాంగం, రాష్ట్ర ప్రజల సంక్షేమానికి వ్యతిరేకంగా గవర్నర్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కళాశాల కార్యక్రమాల్లో పాల్గొని విద్యార్థులచే 'జై శ్రీరామ్' అని నినాదాలు చేయించడం రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న గవర్నర్ చర్యలు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మరోవైపు రాష్ట్రానికి నిధులు అందించడంలో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చూపుతున్న పక్షపాత ధోరణి సరికాదన్నారు. గవర్నర్‌ను రీకాల్ చేయాలని, రాష్ట్రానికి అందించాల్సిన నిధులు, బకాయిలు సత్వరం విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 25వ తేది ఉదయం నుంగంబాక్కంలోని శాస్త్రిభవన్ ఎదుట తన నేతృత్వంలో ధర్నా జరుగుతుందని షణ్ముగం తెలిపారు.

నేడు టీవీకే ఐటీ వింగ్ సమావేశం

పెరంబూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) సాంకేతిక విభాగం, సోషల్ మీడియా విభాగం సమావేశం షోలింగనల్లూర్‌లో శనివారం జరుగనుంది. షోలింగనల్లూర్ ఓఎంఆర్ రోడ్డు సమీపంలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్.ఆనంద్ నేతృత్వంలో జరుగనున్న సమావేశంలో ఎన్నికల ప్రచార నిర్వహణ ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జున, సాంకేతిక విభాగం డిప్యూటీ విభాగం డిప్యూటీ జనరల్ సెక్రటరీ నిర్మల్ కుమార్, సోషల్ మీడియా విభాగం డివిజన్ కో-ఆర్డినేటర్ గురుమూర్తి తదితరులు హాజరుకానున్నారు. సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు వార్తలు, ప్రకటనలు అప్‌లోడ్ చేయడం, పార్టీపై వచ్చే విమర్శలకు దీటుగా సమాధానమివ్వడం సహా పలు అంశాలపై చర్చించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

26 నుంచి విజయ్ అధ్యక్షతన కోవైలో టీవీకే బూత్‌కమిటీల మహానాడు

చెన్నై, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తమిళగవెట్రి కళగం నేత విజయ్ అధ్యక్షతన ఈ నెల 26, 27 తేదీల్లో ఆ పార్టీ బూత్ కమిటీల మహానాడు నిర్వహించనున్నారు. కోయంబత్తూరు శరవణపట్టిలో 26 మధ్యాహ్నం 3 గంటలకు ఈ మహానాడు ప్రారంభమవుతుంది. ఈ నెల 27 సాయంత్రం వరకూ జరిగే ఈ మహానాడులో కోయంబత్తూరు, సేలం, తిరుప్పూరు, ఈరోడ్, నామక్కల్, నీలగిరి జిల్లాలకు చెందిన బూత్ కమిటీల ఇన్‌ఛార్జీలు, సభ్యులతో విజయ్ సమావేశమవుతారు.

నూతన వక్ఫ్ బోర్డు రాజ్యాంగానికి వ్యతిరేకం



ధర్నా నిర్వహిస్తున్న ముస్లింలు

వేలూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నూతన వక్ఫ్ చట్టాన్ని వెనక్కితీసుకోవాలంటూ ముస్లిం ప్రజలు వేలూరు సమీపం పేర్నాంబట్టులో శుక్రవారం ఉదయం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనైత్తు ముస్లిం కమిటీ అధ్యక్షులు అమీన్ సిద్ధిక్ అధ్యక్షతన నిర్వహించిన ఈ నిరసనలో ఆయన మాట్లాడుతూ, ఈ నూతన వక్ఫ్ చట్టం రాజ్యాంగ వ్యతిరేకమని దీనిని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, నేతలు, ప్రజలు పాల్గొన్నారు.



మహిళలను కించపరిచేలా వ్యాఖ్యానించిన పొన్ముడిని మంత్రి పదవి నుంచి తొలగించాలని కోరుతూ వేలూరులో శుక్రవారం హిందూ మున్నని కోట అధ్యక్షుడు మహేష్ నేతృత్వంలో ఆందోళన చేస్తున్న దృశ్యం

కొత్త బస్సులు ప్రారంభించిన ఎంపీ



పెట్రోల్ బంక్ ప్రారంభిస్తున్న ఎంపీ కదిర్ ఆనంద్

వేలూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గుడియాత్తం డిపోకు కేటాయించిన 12 కొత్త బస్సులను వేలూరు ఎంపీ కదిర్ ఆనంద్ ప్రారంభించారు. అలాగే రూ.2 కోట్లతో ఏర్పాటుచేసిన పెట్రోల్ బంక్‌ను ఎంపీ ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షత వహించగా, ఎమ్మెల్యేలు అమ్ములు, నందకుమార్, జిల్లా పంచాయతి అధ్యక్షుడు బాబు, గుడియాత్తం మున్సిపాలిటీ అధ్యక్షుడు సౌందర్‌రాజన్, గుడియాత్తం పంచాయతి ఉపాధ్యక్షుడు సత్యానందం, రవాణా శాఖ డైరెక్టర్ గుణశేఖరన్, జనరల్ మేనేజర్ గణపతి, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ జనరల్ మేనేజ్ దీపక్ తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీలో కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్న పుదువై విశ్వ విద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.ప్రకాష్‌బాబు

'పింక్' ఆటోలు పురుషులు నడిపితే చర్యలు

● సాంఘిక సంక్షేమ శాఖ హెచ్చరిక

పెరంబూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): 'పింక్' ఆటోలు పురుషులు నడిపితే చర్యలు చేపడతామని సాంఘిక సంక్షేమ శాఖ హెచ్చరించింది. నగరంలో మహిళలు, పిల్లలకు ప్రత్యేక భద్రత కల్పించే లక్ష్యం, మహిళలకు ఆర్థిక స్థోమత కల్పించేలా జీపీఎస్‌తో కూడిన 'గులాబి రంగు' ఆటోల సేవలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆ ప్రకారం, గత నెల 8వ తేది అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 165 మంది మహిళలకు ముఖ్యమంత్రి స్టాలిన్ 'పింక్ ఆటోలు' అందజేశారు. రూ. లక్ష సబ్సిడీ, బ్యాంక్ రుణం ద్వారా ఆటోలు అందించారు. ఈ పథకంలో రెండో విడత లబ్ధిదారుల ఎంపికను సాంఘిక సంక్షేమ శాఖ చేపట్టింది. అందుకోసం 141 మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో, ఇప్పటికే అందజేసిన పింక్ ఆటోలను మహిళలకు బదులు పురుషులు నడుపుతున్నారని ఫిర్యాదులందాయి. ఈ విషయమై దృష్టి సారించిన సాంఘిక సంక్షేమ శాఖ, పింక్ ఆటోలు మహిళలు మాత్రమే నడపాలని, పురుషులు నడిపితే చర్యలు చేపడతామని, ఈ విషయమై ఆర్టీఓ అధికారులు తనిఖీలు చేపడతారని హెచ్చరిస్తూ ప్రకటన జారీ చేసింది.

అన్నా విశ్వవిద్యాలయానికి బాంబు బెదిరింపు

పెరంబూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నా విశ్వవిద్యాలయానికి బాంబు బెదిరింపు వచ్చింది. గిండి సమీపంలోని అన్నా విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని కంప్యూటర్ కేంద్రానికి గురువారం సాయంత్రం వచ్చిన ఈ-మెయిల్‌లో బాంబు బెదిరింపు మెసేజ్ ఉంది. ఈ విషయాన్ని వర్సిటీ అధికారులు కొట్టూరుపురం పోలీసులకు తెలియజేశారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో అక్కడకు చేరుకున్న పోలీసులు, వర్శిటీ, ప్రాంగణాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి బాంబు బెదిరింపు ఫేక్ అని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం ఉదయం మళ్లీ ఈ-మెయిల్‌లో బాంబు బెదిరింపు వచ్చింది. అక్కడ 'న్యాన్సీ' అనే పోలీసు జాగిలంతో తనిఖీ చేసిన పోలీసులు ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించి, ఈ-మెయిల్ పంపిన చిరునామా కోసం విచారిస్తున్నారు.

బరువు తగ్గించే సంస్థకు రూ.25వేల జరిమానా

పెరంబూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలిలో బరువు తగ్గించే సంస్థకు వినియోగదారుల ఫోరం రూ.25వేల జరిమానా విధించింది. రెగీటిమ్మా అనే మహిళ వినియోగదారుల ఫోరంలో దాఖలుచేసిన పిటిషన్‌లో... బరువు తగ్గడం కోసం ప్రముఖ సంస్థలో చేరగా, బరువు తగ్గడానికి యంత్రాన్ని ఉపయోగించి మసాజ్ చేసిన తర్వాత వెన్నునొప్పి రావడంతో చికిత్స కొనసాగించలేకపోయినట్లు, అందువల్ల తాను చెల్లించిన ఫీజు తిరిగివ్వాలని కోరినా సంస్థ నిర్వాహకులు స్పందించలేదని, తనకు న్యాయం చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్ విచారించిన ఫోరం... పిటిషనర్ నుంచి వసూలుచేసిన ఫీజు రూ.90వేలు, మానసిక వేదనకు గురిచేసినందుకు రూ.25వేల జరిమానా చెల్లించాలని ఉత్తర్వులు జారీచేసింది.

రామేశ్వరం రిసార్ట్‌లో గదుల సీజ్

పెరంబూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): చట్టవ్యతిరేక నగదు బట్వాడా చట్టం కింద విచారణ చేపట్టిన ఈడీ రామేశ్వరంలో లగ్జరీ రిసార్ట్‌లో రూ.30 కోట్ల విలువైన 60 గదులకు సీలు వేసింది. రామేశ్వరంలో 'సెవెన్ హిల్స్' అనే పేరుతో లగ్జరీ రిసార్ట్ ఏర్పాటైంది. డీఎం ట్రేడర్స్, కేకే ట్రేడర్స్ అనే కంపెనీలతో సంబంధాలున్న ఈ రిసార్ట్ ద్వారా చట్టవ్యతిరేక నగదు బట్వాడా చేసాయని ఈడీ విచారణలో తేలింది. ఈ క్రమంలో, ఈడీ జరిపిన ఆకస్మికతనిఖీల్లో పలు కీలక పత్రాలు లభ్యమయ్యాయి. రిసార్ట్ ఉన్న రూ.30 కోట్ల విలువైన 60 గదులు, ఖాళీగా ఉన్న ప్రాంతాలను ఈడీ స్వాధీనం చేసుకుంది. స్వాధీనం చేసుకున్న రిసార్ట్ చిత్రాలను ఈడీ తన సామాజిక మాధ్యమంలో విడుదల చేసింది. మనీ ల్యాండరింగ్ చట్టం కింద, ఈడీ కోల్‌కత్తా మండల కార్యాలయం ద్వారా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

మంత్రి పొన్ముడిపై కేసు నమోదు అంశం... న్యాయనిపుణులను సంప్రదిస్తున్న పోలీసులు

అడయార్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మహిళలను కించపరిచేలా వ్యాఖ్యానించి వివాదంలో చిక్కుకున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ పొన్ముడిపై కేసు నమోదు చేసేందుకు పోలీసులు న్యాయనిపుణులతో సంప్రదిస్తున్నారు. స్థానిక తేనాంపేటలో పెరియార్ ద్రావిడ కళగం ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న మంత్రి పొన్ముడి మహిళలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు పెను వివాదానికి దారితీశాయి. ఈ వ్యాఖ్యలను డీఎంకే ఎంపీ కనిమొళి సహా ఆ పార్టీ నేతలు ఖండించారు. ఈ నేపథ్యంలో అయితే, మంత్రిపై కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని మద్రాస్ కోర్టు న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ ఆదేశించారు. దీంతో చెన్నై నగర పోలీసులు మంత్రి పొన్ముడిపై కేసు నమోదుకు న్యాయనిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నారు.

గుట్కా రవాణా : బీజేపీ నేత అరెస్టు

అడయార్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా ఆత్తూరు సమీపంలో నాలుగు బస్తాల గుట్కాల అక్రమ రవాణా కేసులో బీజేపీ నేత సహా ఆయన సోదరుడిని సేలం పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని బాలాజీ, మహేంద్రన్‌లుగా గుర్తించారు. వీరి నుంచి స్వాధీనం చేసుకున్న 4 బస్తాల నిషేధిత పొగాకు ఉత్పత్తుల్లో 80 కేజీల హాన్స్ ఒక ద్విచక్రవాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. వీరిని విచారించగా బెంగళూరులోని దౌల్‌రాజ్ అనే వ్యాపారి వద్ద హాన్స్ ప్యాకెట్లను కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్నట్లు వెల్లడించారు. వీరిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

చిత్రజ్యోతి



సక్సెస్ మీట్‌లో చిత్ర బృందం

నా భార్య కంటే అజిత్‌ను అమితంగా ప్రేమిస్తా

● అధిక్ రవిచంద్రన్

తన భార్య కంటే హీరో అజిత్ కుమార్‌ను అమితంగా ప్రేమిస్తానని సినీ దర్శకుడు అధిక్ రవిచంద్రన్ అన్నారు. తన దర్శకత్వంలో అజిత్ హీరోగా వచ్చిన చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. టాలీవుడ్ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మించగా, ఇటీవల విడుదలై ఘన విజయం సాధించి ఇప్పటివరకు రూ.200 కోట్లకు పైగా కలెక్షన్లను రాబట్టింది. దీంతో ఈ చిత్ర బృందం తాజాగా నగరంలో థ్యాంక్స్ గివింగ్ మీట్ ఏర్పాటుచేసింది. ఇందులో దర్శకుడు అధిక్ రవిచంద్రన్, చిత్ర నిర్మాతలు నవీన్ ఎర్నేని, రవి శంకర్, సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్, నటులు అర్జున్ దాస్, రెడిన్ కింగ్‌స్లీ, ప్రసన్న, అజార్ మాస్టర్, కార్తికేయ దేవ్, రఘురామ్, నటి ప్రియా ప్రకాష్ వారియర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు అధిక్ రవిచంద్రన్ మాట్లాడుతూ, ' పాఠశాలలో ఏడో తరగతి చదువుకునే పిల్లోడు ఒకడు.. ఒక నటుడిని చూసి ప్రేరణ పొంది, దర్శకుడు కావాలన్న ఆకాంక్షే నన్ను ఇక్కడ నిలబెట్టింది. చిత్రపరిశ్రమలోకి రాకపోతే నా కెరీర్ ఎలా ఉండేదో కూడా ఊహించుకోడానికి భయంగా ఉంది. ఇండస్ట్రీలో నేను హిట్ దర్శకుడిని కాదు. కెరీర్ ఆరంభంలో ఒక్కటి మాత్ర హిట్ చిత్రం. కానీ, అజిత్ కుమార్ నాపై ఎంతో నమ్మకంతో ఈ చిత్ర బాధ్యతలను అప్పగించారు. అలాగే, నిర్మాతలు కూడా. అజిత్ అందరినీ సాటి మనుషులుగా చూస్తారు. కానీ, ఆయన నాలో ఏమి గుర్తించారో ఇప్పటికీ అర్థంకావడం లేదు. నన్ను ఈ స్థానంలో నిలబెట్టిన అజిత్‌కు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ఈ సినిమా అంత ఎనర్జిటిక్‌గా రావడానికి కారణం అజిత్. ఈ సినిమా కోసం ఆయన చేయాల్సిందంతా చేశారు. ఒక్కరాత్రిలోనే డబ్బింగ్ పూర్తి చేశారు. నా జీవితంలో నా తల్లి దండ్రుల తర్వాత ఆయనే నాకు ముఖ్యం' అని పేర్కొన్నారు.

రజనీతో పనిచేయడం స్పెషల్

● పూజా హెగ్డే

సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో కలిసి 'కూలీ' సినిమా కోసం పనిచేయడం చాలా సంతోషంగా ఉందని హీరోయిన్ పూజా హెగ్డే అన్నారు. విజయ్ నటించిన 'బీస్ట్' సినిమాలో నటించిన ఆమె ఆ తర్వాత సూర్యతో కలిసి 'రెట్రో', విజయ్ 'జననాయగన్', రాఘవ లారెన్స్ 'కాంచన-4' వంటి చిత్రాల్లో నటిస్తున్నారు. అలాగే, లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కూలీ' మూవీలో కూడా ఆమె ప్రత్యేక గీతంలో నర్తించారు. ఈ మూవీలో రజనీకాంత్‌తో కలిసి పనిచేయడంపై ఆమె స్పందిస్తూ, 'రజనీతో కలిసి పనిచేయాలన్నది నా సుదీర్ఘ కాల నిరీక్షణ, కోరిక కూడా. అందుకే ఆ మూవీలో ఒక పాటకు నృత్యం చేశాను. రజనీతో కలిసి పనిచేసిన అనుభవం సూపర్ స్పెషల్. నేను చేసిన ఈ ఒక్క పాట 'జైలర్' మూవీలో తమన్నా చేసిన పాటలా సూపర్ హిట్ అవుతుంది. ముఖ్యంగా ఈ పాటలో ఉన్న స్టెప్స్, డ్యాన్స్ మూవ్‌మెంట్స్ కొత్తగా ఉంటాయి. అభిమానులు ఎంతో ఎంజాయ్ చేస్తారు' అని పేర్కొన్నారు.



శ్రీరామ్ ఆరోగ్యంపై అసత్య ప్రచారం వద్దు : లోకేష్ కనకరాజ్


శ్రీరామ్ - లోకేష్ కనకరాజ్

నటుడు శ్రీరామ్ ఆరోగ్యంపై మీడియాలో సాగుతున్న ప్రచారంపై దర్శకుడు లోకేష్ కనకరాజ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీరామ్ ఆరోగ్య పరిస్థితిపై తప్పుడు కథనాలను ప్రసారం చేయొద్దని కోరారు. 'వైద్య నిపుణుల సూచనలు, సలహాల మేరకు చికిత్స పొందుతూ విశ్రాంతి తీసుకుంటున్నారు. శ్రీరామ్ అనారోగ్యం నుంచి కోలుకుని సాధారణ జీవితంపై దృష్టిసారించే వరకు ఆయన వ్యక్తిగత జీవితంపై గోప్యత పాటించాలి. ప్రస్తుతం ఆయన గురించి మీడియాలో వస్తున్న వార్తలు, తప్పుడు కథనాలు ఎంతగానో బాధిస్తున్నాయి. ఇకనైనా ఈ తరహా అసత్య ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని అభ్యర్థిస్తున్నాం' అని లోకేష్ కనకరాజ్ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'గ్యాంగర్స్' వెబ్ తరహా చిత్రం


సుందర్, వడివేలు

● దర్శకుడు సుందర్ సి

గతంలో తమిళంలో వచ్చిన 'మణి హీస్ట్' బాణీలో 'గ్యాంగర్స్' కూడా ఒక వెబ్ సిరీస్ తరహా మూవీ అని ఆ చిత్ర దర్శకుడు సుందర్ సి అన్నారు. 'అరణ్మనై-4' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత సుందర్ దర్శకత్వం వహించిన చిత్రం 'గ్యాంగర్స్'. ఇందులో సుందర్, వడివేలు ప్రధాన పాత్రలు పోషించగా, ఈ నెల 24న విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని తాజాగా విలేకరుల సమావేశాన్ని చిత్ర బృందం ఏర్పాటుచేసింది. ఇందులో దర్శకుడు మాట్లాడుతూ, 'వడివేలు అన్నతో కలిసి మళ్ళీ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించేందుకు వస్తున్నాం. ఈ చిత్రంపైనా, నా మీద నమ్మకం పెట్టిన ఏసీ షణ్ముగం, ఏసీఎస్ అరుణ్ కుమార్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు. ఈ సినిమా ప్రారంభానికి మూలకారణం వడివేలు. ఒక చిన్న ఊరిలో ఆటో డ్రైవర్, టీచర్ కథా పాత్రలతో ఒక సినిమా తీస్తే ఎలా ఉంటుందన్నదే ఈ స్టోరీ. ఈ మూవీకి ఎలాంటి టైటిల్ పెట్టాలో తెలియక తికమకపడుతున్న సమయంలో వడివేలు ఆలోచించి 'గ్యాంగర్స్' అనే టైటిల్ పెడితే బాగుంటుందని చెప్పగా ఆ టైటిల్‌నే ఖరారు చేశాం. తప్పకుండా ప్రతి ఒక్కరినీ అలరించే మూవీగా ఉంటుంది' అని పేర్కొన్నారు.


డాక్టర్ పార్వతి


సహచర వైద్యులు, ఉద్యోగులతో...

'సర్వేంద్రియాణాం నయనం ప్రధానం' అంటారు పెద్దలు ఆ కళ్లు మసకేస్తే మబ్బు తొలగించి వెలుగులు ప్రసాదించే జ్ఞానదీపికే నేత్ర వైద్యులు. నిత్యం ఎంతో మందికి చూపును సరిచేసి వారి కళ్లలో కాంతులు నింపుతూ చెక్కుచెదరని నిబద్ధత నిజాయితీ కలిగిన నేత్ర వైద్యురాలు డాక్టర్ ఎ.పార్వతి. ఆమె వైద్యప్రస్థానం నేటి 'తరుణి'లో...

- వేళచ్చేరి, ఆంధ్రజ్యోతి

నిబద్ధతకు నిర్వచనం

తరుణి

వైద్య సేవే వ్యాపకం

● ప్రముఖ నేత్ర వైద్యురాలు పార్వతి

"మన శరీరంలో ముఖ్యమైన అంగం కన్ను. దాని పట్ల ఎంతో జాగరూకతతో మెలగాలి. ఎలాంటి అసౌకర్యం కలిగినా వెంటనే కంటి డాక్టర్‌ని సంప్రదించాలి. కంటి శుక్లాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించి సకాలంలో చికిత్స చేయించుకోవాలి. అంటూ డాక్టర్ పార్వతి తరుణితో తన మనోభావాలను వెల్లడించారు.

పార్వతి జన్మించింది నెల్లూరులో. ఆమె తండ్రి రామమూర్తి, డిప్యూటీ కలెక్టర్‌గా సేవలందించారు. తల్లి శ్రీలక్ష్మి, గృహిణి, పార్వతికి ఒక సోదరి. నెల్లూరులోని ఏబీఎం గర్ల్స్ హైస్కూలులో పదవ తరగతి పూర్తిచేసి, వీఆర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివిన పార్వతి, తిరుపతిలోని వెంకటేశ్వర మెడికల్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేశారు. ఆ తరువాత కర్నూలులో ఎమ్మెస్ చేశారు.

వైద్య విద్యకు అంకురార్పణ...:

నాకు నాలుగేళ్ల ప్రాయంలో డాక్టర్ కావాలన్న కోరికకు అంకురార్పణ జరిగింది. మా ఎదురింట్లో ఉండే డాక్టర్ మాతంగి నాకు మొట్టమొదటి ప్రేరణ. ఆ వయసులో డాక్టర్ అనే పిలుపు, తెల్ల కోటు... నా మనసులో చెరగని ముద్ర వేశాయి.అప్పట్లో నా పుస్తకాల మీద నా పేరు బదులు డా.మాతంగి అని రాసుకునేదాన్ని. ఆపైన నాన్నకు మెడిసన్‌పైన ఉన్న ఆసక్తి, నన్ను డాక్టర్‌గా చూడాలన్న ఆయన కోరిక నాకు మరింత స్ఫూర్తి కలిగించాయి. అందుకే పట్టుదలతో చదివి మెడిసిన్‌లో సీటు పొందాను. మా కుటుంబంలో నేనే మొట్టమొదటి వైద్యురాలిని.. అని పార్వతి తన వైద్య విద్య నేపథ్యాన్ని వివరించారు.

ఉద్యోగ ప్రస్థానం..

ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో రాష్ట్రంలో ఆరో ర్యాంకు సాధించిన పార్వతి మెడిసన్ చివరి ఏడాది నుండే వైద్యవృత్తిలో ప్రవేశించారు. నగరిలో కొంతకాలం, వడమాలపేటలో రెండేళ్లు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. గ్రామీణ హెల్త్ సెంటర్లలో పనిచేసే రోజుల్లో రోగులకు వైద్యం చేయడంతో బాటు ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించేవారు.

చెన్నైలో స్థిరపడిన అనంతరం కళ్యాణి హాస్పిటల్‌లో పదేళ్ల పాటు నేత్ర వైద్యురాలిగా పనిచేశారు. అదే సమయంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ స్థాపించిన ఆంధ్ర మహిళా సభ హాస్పిటల్‌లో కూడా వైద్య సేవలందించారు. అక్కడ రాజసులోచన, రామలక్ష్మీ ఆరుద్ర ఇలా ఎంతోమంది ప్రముఖులకు కంటి ఆపరేషన్లు చేసిన విషయాన్ని పార్వతి గుర్తుచేసుకున్నారు. ఎంతో తక్కువ ఫీజుతో కొన్ని, ఉచితంగా కొన్ని కంటి ఆపరేషన్లు చేశారు. కళ్యాణి హాస్పిటల్‌లో కూడా కొన్ని ఆపరేషన్లు ఉచితంగా చేసేవారు. ఆలిండియా సాయి సమాజ్ మైలాపూర్‌లోని సాయిబాబా మందిరంలో నిర్వహించిన 'ఐ' క్లినిక్‌లో వారానికి ఒకరోజు రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు, ఆపరేషన్లు చేసేవారు. 1992 నుండి 2003వ సంవత్సరం వరకు ఎన్నో హెల్త్ క్యాంపులు నిర్వహించారు. 2003వ సంవత్సరం నుండి 2013 వరకు భర్త ఉద్యోగరీత్యా హైదరాబాద్ వెళ్లిన ఆమె అక్కడ సెయింట్ థెరిస్సా హాస్పిటల్‌లో విధులు నిర్వహించారు. ఆ తర్వాత తిరిగి చెన్నై చేరిన పార్వతి అప్పటి నుండి కళ్యాణి హాస్పిటల్‌లో నేత్ర వైద్యురాలుగా పనిచేస్తూ సాయం వేళ చిత్రకూళంలోని నేత్ర ఐ క్లినిక్‌లో కంటి పరీక్షలు చేస్తున్నారు. ఇప్పటివరకు తన వైద్యప్రస్థానంలో 40 వేల ఆపరేషన్లు చేసిన ఘనత సాధించారు పార్వతి.


కంటి శస్త్రచికిత్స చేస్తూ....

వ్యక్తిత్వం: నిబద్ధత, నిజాయితీ, అంకితభావం త్రివేణి సంగమంలా ఆమెలో సంగమించాయి. మానవీయ విలువలు నింపుకున్న ఆమె వైద్యసేవకు కులమత భేదాలు లేవు. ఒకప్పుడు జరిగిన ప్రమాదం కారణంగా అపస్మారక స్థితిలో, హాస్పిటల్‌లో ఉన్న పార్వతి త్వరగా కోలుకోవాలని, ఆమె దగ్గర చికిత్స పొందిన వివిధ మతాల వారు ఆయా పవిత్ర స్థలాల నుండి తెచ్చిన పవిత్ర జలాలు అందించడంతో బాటు ప్రార్థనలు చేయడం ఆమె వైద్యసేవకు నిదర్శనం. అనాథ శరణాలయాలకు కూడా వెళ్లి అక్కడ వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తుంటారు. వైద్యవృత్తిని వ్యాపారంలాగ కాక ఒక పవిత్రమైన విధిగా తలచి విధులు నిర్వహిస్తారు. ఉన్నతమైన ఆలోచనలు, ఉదారమైన ఆశయాలు ఆమె సొంతం.

కుటుంబ నేపథ్యం: పార్వతి భర్త డాక్టర్ రామ్మోహన్. కార్డియోథొరాసిక్ సర్జన్. ఈ దంపతులకు ఇద్దరు మగపిల్లలు.

ఐవోసీకి 'స్కాచ్ గోల్డ్ అవార్డు'


అవార్డు అందుకుంటున్న ఐవోసీ ప్రతినిధులు

చెన్నై, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆయిల్‌కు చెందిన ఫ్లాగ్‌షిప్ ఎక్స్‌ట్రా పవర్ ఫ్లీట్‌కార్డ్ లాయల్టీ ప్రోగ్రామ్‌కు డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ బిజినెస్ ప్రాసెస్ ట్రాన్స్‌ఫర్మేషన్ కేటగిరీలో స్కాచ్‌గోల్డ్ అవార్డు లభించింది. 100వ స్కాచ్ సమ్మిట్ సందర్భంగా ప్రదానం చేసిన ఈ అవార్డును టీమ్ ఇండియన్ ఆయిల్, స్కాచ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ అధ్యక్షుడు సమీర్ కొచార్ నుంచి ఐవోసీ ప్రతినిధులు అందుకున్నారు. భారతదేశం అంతటా లక్షలాదిమంది ఫ్లీట్ ఆపరేటర్లకు ఎక్స్‌ట్రా పవర్ ఫ్లీట్ కార్డ్ ప్రోగ్రామ్ ఇప్పటికీ విశ్వసనీయ పరిష్కారంగా వుంది. ఇంధన కొనుగోళ్లు, కార్యకలాపాలను క్రమబద్ధీకరించడానికి రియల్ టైమ్ నియంత్రణ, పారదర్శకత, విలువ ఆధారిత ప్రయోజనాలను అందిస్తోంది.

హిట్స్ ఆధ్వర్యంలో

నవయంత్ర రిసెర్చ్ ఎక్స్‌పో-2025


నూతన అన్వేషణలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

చెన్నై, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన హిందూస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (హిట్స్) ఆధ్వర్యంలో నూతన అన్వేషణలను ప్రోత్సహించేలా పరిశోధక విద్యార్థుల కోసం నవయంత్ర రిసెర్చ్ ఎక్స్‌పో-2025 పేరుతో నిర్వహించిన ప్రదర్శనకు అపూర్వ స్పందన లభించింది. ఆ సంస్థ బే రేంజ్ క్యాంపస్‌లో జరిగిన ఈ ప్రదర్శనలో 11 పరిశోధన కేంద్రాల నుండి వందకు పైగా వచ్చిన నూతన పరికరాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి బిర్లా గోబెల్ యూనివర్శిటీ మాజీ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ పీపీ మాథూర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో క్యాన్సర్ మందు పనితీరును రెమోట్ సెన్సింగ్ ద్వారా కనుగొనే పరికరం తయారు చేసిన సీనియర్ పరిశోధక విద్యార్థి జే జేనియల్‌కు డాక్టర్ లూర్థుస్వామి ఇన్నోవేషన్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డు కింద రూ.30 వేల నగదు ప్రశంసా పత్రం అందజేశారు. ఇదేవిధంగా జూనియర్ పరిశోధక విద్యార్థులకు ఇచ్చే డాక్టర్ లూర్థుస్వామి ఇన్నోవేషన్ అవార్డును వాసుదేవన్, సూర్యకుమార్ స్వీకరించారు. ఈ అవార్డు కింద రూ.20 వేల నగదు, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో హిట్స్ ఛాన్సలర్ డాక్టర్ ఆనంద్ జేకబ్ వర్గీస్ తదితరులు పాల్గొన్నారు.

మారియమ్మన్ ఆలయంలో తైలకాప్పు అభిషేకం ప్రారంభం


ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు చేస్తున్న వేద పండితులు

చెన్నై, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తంజావూరు సమీపం పున్నైనల్లూరు మారియమ్మన్ ఆలయంలో ఐదేళ్లకొకమారు మండలం (48రోజుల)పాటు నిర్వహించే తైలకాప్పు అభిషేకం శుక్రవారం ఉదయం ప్రారంభమైంది. ఈ ఆలయంలో అమ్మవారు వల్మీకం (పుట్ట) రూపంలో స్వయంభువుగా ఆవిర్భవించడంతో అమ్మవారికి అభిషేకాలు చేయరు. ఉత్సవమూర్తికి మాత్రమే అభిషేకాలు చేస్తారు.. ఇక శుక్రవారం నుండి అమ్మవారి మూలవిరాట్టు ఆకారాన్ని తెల్లటి వస్త్రంపై చిత్రలేఖనంగా పొందుపరచి గర్భాలయం ముందు వేలాడదీస్తారు. భక్తులు ఆ వస్త్రం దిశగానే అర్చనలు, పూజలు చేస్తారు. తైలకాప్పు ప్రారంభం సందర్భంగా విఘ్నేశ్వరపూజ, దేవతానుజ్ఞ, పుణ్యావహచనం, , జపహోమం, పూర్ణాహుతి జరిపారు. గృహప్రీతి, కలశ ఊరేగింపు జరిగాయి. ఆ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. జూన్ నాలుగు వరకూ ఈ తైలకాప్పు అభిషేకాలు నిర్వహించిన తరువాత గర్భాలయంలో అమ్మవారి దర్శనం పునఃప్రారంభమవుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

శిలువ మార్గం ఊరేగింపు దృశ్యాలు



భక్తిశ్రద్ధలతో శుభ శుక్రవారం

● ప్రార్థనలకు తరలివచ్చిన క్రైస్తవులు



ప్యారీస్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): చర్చిల్లో శుభ శుక్రవారం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేకప్రార్థల్లో క్రైస్తవులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. గుడ్‌ఫ్రైడే పర్వదినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్యాథలిక్, ఈసీఐ, చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా, ప్రొటెస్టంట్, అపోస్థులు, లూథరన్ తదితర చర్చిల్లో శుక్రవారం ఉదయం 11 నుంచి 3గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన నాగపట్నం జిల్లాలోని వేళాంకన్ని మేరీమాత క్షేత్రం, తంజావూర్ జిల్లా తిరుత్తురైపూండిలోని పూండి మేరీమాత చర్చి, మైలాపూర్‌లోని శాంథోం చర్చి, సెయింట్ థామస్ మౌంట్ చర్చి, సైదాపేట లిటిల్‌మౌంట్ చర్చి, ఎగ్మోర్ సేక్రేడ్ హార్ట్ చర్చి, ప్యారీస్‌లోని సెయింట్ ఆంథోని చర్చి, జెమిని సర్కిల్‌లోని కెథిడ్రల్ చర్చి, పెరంబూరు సెయింట్ పీటర్ చర్చి, పెరంబూరు లూర్దుమాత చర్చి సహా అన్ని చర్చిల్లో క్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటల సారాంశాన్ని మతపెద్దలు వినిపించారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనేముందు నిర్వహించిన 'శిలువ మార్గం' ఊరేగింపులో కొయ్య శిలువలు పట్టుకుని పాటలు పాడుతూ యేసు క్రీస్తు త్యాగాన్ని కీర్తిస్తూ, పిల్లల నుండి పెద్దల వరకు పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు.





యేసుక్రీస్తు విగ్రహం వద్ద ప్రార్థిస్తున్న భక్తురాలు - చర్చిలోకి భక్తులను ఆహ్వానిస్తున్న మహిళలు - కొవ్వొత్తులు వెలిగిస్తున్న భక్తులు


పెరంబూరు లూర్దుమాత చర్చిలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు